AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH, TRUST, TREND

www.aksharatoday.in

సంఘాల సొమ్ముకు అవినీతి గండం..





రైతు సమస్యలపై రోడ్డెక్కిన బీజేపీ నేతలు

ఎమ్మెల్యే భూపతిరెడ్డిని కలిసిన నార్త్ రూరల్ సీఐ



అక్షరటుడే, డిచ్‌పల్లి: నిజామాబాద్ నార్త్ రూరల్ సీఐగా శ్రీనివాస్ ఇటీవల బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా గురువారం ఆయన రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. శాంతిభద్రతల పరిరక్షణలో అంకితభావంతో పనిచేయాలని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సమర్థవంతంగా విధులు నిర్వహించాలని ఎమ్మెల్యే సూచించారు.

8-10-2026 | NIZAMABAD / KAMAREDDY | PAGES - 2



కస్తూర్బాను తనిఖీ చేసిన కలెక్టర్

అక్షరటుడే, డిచ్‌పల్లి: సిరికొండ మండలం పెద్దవాల్గోట్ గ్రామంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని కలెక్టర్ ఇలా త్రిపాఠి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల పరిసరాలను, వంట గది, స్టోర్ రూమ్, తరగతి గదులను పరిశీలించారు. కస్తూర్బా పరిసరాలు పిచ్చి మొక్కలతో నిండి అపరిశుభ్రంగా ఉండడాన్ని గమనించి నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థినులు విష కీటకాల బారినపడితే ఎవరు బాధ్యులని ప్రశ్నించారు. వెంటనే పరిసరాలను శుభ్రం చేయించాలని, దోమలు వృద్ధి చెందకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సిబ్బంది, విద్యార్థినుల హాజరును ఎఫ్ఆర్ఎస్ విధానంలో అమలు చేస్తున్నారా లేదా అన్నది పరిశీలించారు. పలువురు సిబ్బంది అటెండెన్స్ నమోదు వివరాలలో తేడాలు ఉన్నట్లు గమనించిన కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. హాజరులో లోపాలు ఉంటే జీతాలు నిలిపివేస్తామని హెచ్చరించారు. కలెక్టర్ వెంట తహశీల్దార్ రవీందర్, ఎంపీడీవో ఆరీఫ్ అహ్మద్, ఎంఈవో రమేష్, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ షేక్ పర్వీన్ తదితరులు ఉన్నారు.



అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల నిరవధిక సమ్మె

అక్షరటుడే, నిజామాబాద్ సిటీ: అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జిల్లా తెలంగాణ రాష్ట్ర అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ జేఏసీ నిరవధిక సమ్మెకు పిలుపునిచ్చింది. ఈ మేరకు జేఏసీ నాయకుల ఆధ్వర్యంలో నగరం లోని ధర్నాచౌక్ వద్ద ఉద్యోగులు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ.. తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం సెప్టెంబర్ 22న నిర్వహించిన ధర్నాకు అధికారుల నుంచి ఆశించిన స్పందన లభించలేదని తెలిపారు. సమస్యల పరిష్కారానికి స్పష్టమైన హామీ ఇవ్వకపోవడంతో నిరసనను కొనసాగించాలని నిర్ణయించినట్లు తెలిపారు. నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు అర్బన్ లోకల్ బాడీస్ పరిధిలో పారిశుధ్య కార్మికులు, ఇతర విభాగాల్లో అవుట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న ఉద్యోగులు తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్న పారిశుధ్య కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, తమ న్యాయమైన డిమాండ్లపై సానుకూలంగా స్పందించి సమ్మెను విరమించేలా చర్యలు తీసుకోవాలని జేఏసీ నాయకులు కోరారు.



వ్యాపారుల గ్రామాల బాట..

వరి ధాన్యానికి ఈసారి భారీ డిమాండ్ ఏర్పడింది. ఖరీఫ్ సీజన్‌లో కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల్లో వరిసాగు ఆశాజనకంగా ఉండడంతో పంట చేతికొచ్చే సమయానికి వ్యాపారులు ముందుగానే రంగంలోకి దిగారు. ఇతర జిల్లాల్లో వరి సాగు విస్తీర్ణం తగ్గడంతో ధాన్యం లభ్యత తగ్గే అవకాశం ఉందని అంచనా వేస్తున్న వ్యాపారులు.. ముందుగానే రైతులతో ఒప్పందాలు చేసుకునేందుకు గ్రామాల బాట పడుతున్నారు. కొందరు రైతులకు అడ్వాన్సులు చెల్లిస్తూ ధాన్యాన్ని దక్కించుకునే ప్రయత్నం చేస్తున్నారు. – అక్షరటుడే, ఎల్లారెడ్డి

■ వరి ధాన్యానికి భారీ డిమాండ్ ■ రైతుల వద్దకే రైస్ మిల్లర్లు..
■ మద్దతు ధరకు మించి చెల్లింపులకు సిద్ధం.. ■ అడ్వాన్సులతో రైతులను ప్రసన్నం చేసుకునే యత్నం
■ క్వింటాలుకు రూ.3,100 నుంచి రూ.3,200 వరకు చెల్లింపులు

ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాకముందే ప్రైవేట్ వ్యాపారులు రైతుల వద్దకు చేరుకోవడం చర్చనీయాంశంగా మారింది. ప్రస్తుతం ఎల్లారెడ్డి, నాగిరెడ్డిపేట మండలాల్లో సూర్యాపేట, వర్ని, నిజామాబాద్, కామారెడ్డి ప్రాంతాలకు చెందిన రైస్‌మిల్లర్లు గ్రామాల్లో రైతులను కలిసి ధాన్యం కొనుగోలుకు ముందుకొస్తున్నారు. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో క్వింటాలుకు సుమారు రూ.3,100 వరకు పచ్చి వడ్లను కొనుగోలు చేసినట్లు సమాచారం. వారం రోజుల పాటు చెల్లింపును వాయిదా వేసేందుకు రైతులు అంగీకరిస్తే క్వింటాలుకు రూ.3,200 వరకు చెల్లించేందుకు వ్యాపారులు సిద్ధంగా ఉన్నట్లు తెలిసింది.

వ్యాపారులే రైతుల వద్దకు..

ఈ సీజన్‌లో రైతులు ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల వద్దకు ధాన్యం తీసుకెళ్లడం కంటే.. వ్యాపారులే రైతుల పొలాల వద్దకు వచ్చి కొనుగోలు చేసే పరిస్థితి కనిపిస్తోంది. రానున్న రోజుల్లో డిమాండ్ మరింత పెరిగితే ధరలు ఇంకాస్త పెరిగే అవకాశముందని వ్యాపార వర్గాలు భావిస్తున్నాయి. ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో కరువు పరిస్థితులు నెలకొనే అవకాశం ఉందన్న హెచ్చరికలు రైతుల్లో ఆందోళన కలిగించాయి. ఖరీఫ్ ప్రారంభంలో సకాలంలో వర్షాలు కురవకపోవడంతో పంటలపై రైతులు ఆశలు వదులుకునే పరిస్థితి ఏర్పడింది. అయితే అనంతరం వాతావరణ పరిస్థితుల్లో వచ్చిన మార్పులతో కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల్లో వర్షాలు ఆశాజనకంగా కురిశాయి. దీంతో వరితో పాటు ఇతర పంటలు కూడా మంచి దిగుబడులు ఇచ్చే అవకాశం కనిపిస్తోంది.

నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో..

నిజామాబాద్ జిల్లాలో ఈ వానాకాలం సీజన్‌లో సుమారు 4,35,806 ఎకరాల్లో వరి సాగు చేశారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో వరి పంట కోత దశకు చేరుకుంది. దీంతో మిల్లర్లు, వ్యాపారులు ముందుగానే ధాన్యం కొనుగోళ్లపై దృష్టి సారిస్తున్నారు. అలాగే కామారెడ్డి జిల్లాలో ఈ వానాకాలం సీజన్‌లో 3,19,361 ఎకరాల్లో వరి సాగు చేశారు. ఇందులో 1,09,967 ఎకరాల్లో సన్న ధాన్యం, సుమారు 2.10 లక్షల ఎకరాల్లో దొడ్డు రకం ధాన్యం సాగైంది. రెండేళ్ల క్రితం వరకు సన్నాల సాగు 60 వేల ఎకరాలు దాటకపోగా.. ప్రభుత్వం సన్న ధాన్యానికి అదనంగా క్వింటాల్‌కు రూ.500 బోనస్ ప్రకటించడంతో ఈసారి రైతులు భారీగా సన్న రకాలను సాగు చేశారు. అధికారుల అంచనాల ప్రకారం ఎకరాకు సగటున 25 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తే.. జిల్లాలో సుమారు 2.35 లక్షల మెట్రిక్ టన్నుల సన్న ధాన్యం ఉత్పత్తి అయ్యే అవకాశం ఉంది.

ధర మరింత పెరిగేనా?

ఇతర జిల్లాల్లో వరి సాగు తగ్గడం, కామారెడ్డి-నిజామాబాద్ జిల్లాల్లో ధాన్యం దిగుబడులు ఆశాజనకంగా ఉండటం, మిల్లర్ల నుంచి ముందుగానే డిమాండ్ రావడం వంటి పరిణామాలతో ధాన్యం ధరపై ఆసక్తి పెరిగింది. ప్రస్తుతం క్వింటాల్‌కు రూ.3,100 వరకు పలుకుతున్న ధర.. చెల్లింపుల విషయంలో రైతులు కొంత గడువు ఇస్తే రూ.3,200 వరకు చేరే అవకాశం ఉందని వ్యాపారులు చెబుతున్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు పూర్తిస్థాయిలో ప్రారంభమయ్యేలోపే ప్రైవేట్ వ్యాపారులు

బోనస్ కోసం రైతుల ఎదురుచూపులు

సన్న ధాన్యానికి ప్రభుత్వం క్వింటాలుకు రూ.500 బోనస్ ప్రకటించినప్పటికీ గత యాసంగి సీజన్‌కు సంబంధించిన బోనస్ డబ్బులు ఇంకా అందకపోవడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. గత యాసంగిలో సుమారు 28,326 మంది రైతుల నుంచి సన్న ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు అధికారులు పేర్కొంటున్నారు. మద్దతు ధరకు సంబంధించిన నగదు రైతుల ఖాతాల్లో జమ అయినప్పటికీ.. బోనస్ డబ్బుల కోసం రైతులు ఎదురుచూస్తున్నారు. ఈ వానాకాలం సీజన్‌లోనైనా ప్రభుత్వం సన్న ధాన్యానికి ప్రకటించిన బోనస్‌ను సకాలంలో చెల్లిస్తుందా? లేదా? అనే సందేహం రైతుల్లో నెలకొంది.

తెగుళ్లతో సన్నాలకు దెబ్బ

మరోవైపు జిల్లాలో సన్న ధాన్యం పంటకు తెగుళ్ల బెడద రైతులను కలవరపెడుతోంది. ముఖ్యంగా అగ్గి తెగులు, పచ్చదోమ వంటివి సోకుతున్నట్లు రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం పంట కోత దశలో ఉండడంతో దిగుబడిపై ప్రభావం పడుతుందేమోనని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. మరికొద్ది రోజుల్లో కోతలు ప్రారంభం కానున్న నేపథ్యంలో వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించి తగిన సూచనలు, సలహాలు ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.



ఓపెన్ స్కూల్‌సొసైటీ పరీక్షలకు కట్టుదిట్టమైన భద్రత : సీపీ

అక్షరటుడే,నిజామాబాద్ క్రైం: నిజామాబాద్ కమిషనరేట్ పరిధిలో ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో జరుగనున్న పరీక్షలకు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేస్తున్నామని సీపీ సాయి చైతన్య తెలిపారు. ఈ మేరకు గురువారం ప్రకటన విడుదల చేశారు. ఈనెల 11వ తేదీ నుంచి 17వ తేదీ వరకు 'టాస్' ఎస్సెస్సీ పరీక్షలు ఆదర్శ హిందీ విద్యాలయంలో ఉంటాయన్నారు. అలాగే ఇంటర్ పరీక్ష ఆదర్శ హిందీ విద్యాలయం ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో ఉంటాయని పేర్కొన్నారు. పరీక్ష ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12:00 వరకు, మధ్యాహ్నం 2:30 నుంచి 5:30 వరకు జరుగుతాయని వివరించారు. పరీక్షలు జరిగే రోజు ఉదయం నుంచి సాయంత్రం 6 గంటల వరకు పరీక్షా కేంద్రాల పద్ద సెక్షన్ 163 బీఎన్ఎస్ఎస్ అమలులో ఉంటుందని వెల్లడించారు.



వార్డుల్లో డ్రెయినేజీ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత


అక్షరటుడే, కామారెడ్డి: వార్డుల్లో డ్రెయినేజీ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి అన్నారు. జిల్లా కేంద్రంలోని 38వ వార్డులో గురువారం మౌలిక వసతుల కల్పనలో భాగంగా చేపట్టనున్న సీసీ డ్రెయినేజీ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వార్డుల్లో డ్రెయినేజీ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. అవసరమైన ప్రాంతాల్లో అభివృద్ధి పనులను వేగంగా చేపడుతున్నామన్నారు. సీసీ డ్రెయినేజీ నిర్మాణంతో మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించడంతో పాటు ప్రజలకు మెరుగైన పారిశుధ్య సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ధర్నా.. రాహుల్ గాంధీ అరెస్ట్‌పై ఆగ్రహం



అక్షరటుడే, కామారెడ్డి: లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీతో పాటు కూటమి పార్లమెంటు సభ్యులను ఢిల్లీ పోలీసులు అదుపులోకి తీసుకోవడాన్ని కాంగ్రెస్ శ్రేణులు నిరసించాయి. ఈ మేరకు జుక్కల్ చౌరస్తాలో ఆందోళన చేపట్టారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్ పిలుపుతో జిల్లావ్యాప్తంగా నిరసనలకు దిగారు. ఇందులో భాగంగా జుక్కల్ నియోజకవర్గం లోని జుక్కల్ చౌరస్తా వద్ద 161 వ జాతీయ రహదారి పై ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు, జిల్లా అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు నల్ల చొక్కాలు ధరించి నిరసన తెలిపారు. కేంద్ర ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా 'ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి' అంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజల తరపున ప్రశ్నించే నాయకులను అదుపులోకి తీసుకోవడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని మండిపడ్డారు. ఓటుహక్కు, ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత కోసం తమ పోరాటం కొనసాగుతుందని పేర్కొన్నారు. అందులో పాల్గొన్న రాహుల్ గాంధీని అరెస్ట్ చేయడం సరికాదన్నారు. ఈ ఘటనకు నిరసనగా జిల్లావ్యాప్తంగా ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు.

పోలీస్ శాఖలో ఏఐ వినియోగం మరింత విస్తృతం చేయాలి



అక్షరటుడే, నిజామాబాద్‌క్రైం: పోలీస్ శాఖలో ఏఐ వినియోగాన్ని మరింత విస్తృతం చేయాలని అదనపు డీసీపీ (అడ్మిన్) శుభం ప్రకాష్ అన్నారు. సీపీ కార్యాలయంలో గురువారం సమీక్ష నిర్వహించారు. వివిధ కళాశాలల ప్రిన్సిపాల్స్ , ప్రొఫెసర్లు, ఫ్యాకల్టీ సభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పోలీస్ శాఖలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను ఏ విధంగా అనుసంధానం చేయాలి.. పోలీసింగ్‌లో ఏఐ ఆధారిత సాంకేతికతను ఏయే రంగాల్లో వినియోగించుకోవచ్చనే అంశాలపై విస్తృతంగా చర్చించారు. ప్రత్యేకంగా నేరాల విశ్లేషణ , నేరాల నివారణ, క్రైం డేటా విశ్లేషణ, అనుమానాస్పద కార్యకలాపాల గుర్తింపు, ట్రాఫిక్ నిర్వహణ, సీసీటీవీ ఫుటేజీ విశ్లేషణ, సైబర్ నేరాల దర్యాప్తు, సోషల్ మీడియా మానిటరింగ్, ప్రజలకు పోలీస్ సేవలను మరింత వేగంగా అందించడం వంటి అంశాల్లో ఏఐ సాంకేతికతను వినియోగించుకునే అవకాశాలపై సమీక్షించారు. సమావేశంలో నవ్య భారతి స్కూల్ జాయింట్ సెక్రెటరీ డాక్టర్ శిరీష్, విజయ రూరల్ ఇంజనీరింగ్ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ స్వప్న, ఫ్యాకల్టీ సుజాత, నవ్య, లక్ష్మి, కాకతీయ కాలేజీ ప్రతినిధులు డి.వేణుగోపాల్, నాగార్జున, క్షత్రియ ఇంజినీరింగ్ కాలేజ్ నుండి ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్, సీవోడీ లక్ష్మణ్, సంబంధిత అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

12 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలి



అక్షరటుడే, డిచ్‌పల్లి: రాష్ట్ర ప్రభుత్వం రైతులకు కనీసం 12 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్ అందించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కుమార్ కులాచారి డిమాండ్ చేశారు. డిచ్‌పల్లి మండలం మిట్టపల్లి, రాంపూర్, కమలాపూర్ గ్రామాల్లో నీరు లేక ఎండిపోతున్న వరి పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి తెలంగాణ అంతటా కరువు పరిస్థితులు దాపురించాయని, ముఖ్యంగా నిజామాబాద్ రూరల్ నియోజకవర్గం తీవ్రంగా నష్టపోతోందని దినేష్ కులచారి మండిపడ్డారు. పంటలు ఎండిపోయి తీవ్రంగా నష్టపోతున్న రైతుల వద్దకు వెళ్లి వారి సమస్యలను తెలుసుకున్నారు. స్థానిక రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి శంకుస్థాపనలు, ఇతర ప్రాంతాల్లో పర్యటనలకే సమయం కేటాయిస్తున్నారని, పంటలు ఎండిపోయి కన్నీరు పెడుతున్న రైతులను పరామర్శించేందుకు రావడం లేదని విమర్శించారు. సొంత నియోజకవర్గానికి సాగునీరు అందిస్తామని చెప్పిన ఎమ్మెల్యే, ఇప్పుడు ఎక్కడ ఉన్నారో జాడ లేకుండా పోయారని వ్యాఖ్యానించారు. మిగిలిన పంటలనైనా కాపాడేందుకు రోజుకు 12 గంటల నాణ్యమైన విద్యుత్‌ను ఉచితంగా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. నీరు, కరెంట్ లేక ఎండిపోయిన పంటలకు తక్షణమే పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు చంద్రకాంత్, కిసాన్ మోర్చా అధ్యక్షుడు గంగారెడ్డి, ఉపాధ్యక్షుడు జిల్లా వెల్మ గంగారెడ్డి, నాయకులు ఓంసింగ్, దేశపతి శీను, గణేష్, ప్రదీప్, సురేష్, నవీన్, రత్నం తదితరులు పాల్గొన్నారు.,

ఎల్లారెడ్డి ప్రభుత్వాస్పత్రిలో ఉచిత కంటి పరీక్షశిబిరం



అక్షర టుడే, ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి ప్రభుత్వాస్పత్రిలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్ష శిబిరం నిర్వహించారు. ఇందులో 41 మంది రోగులకు కంటి పరీక్షలు చేశారు. పరీక్షల అనంతరం ఆరుగురికి కంటి శస్త్రచికిత్స అవసరమని గుర్తించి ఐవోఎల్ ఆపరేషన్ కోసం బాన్సువాడ లయన్స్ కంటి ఆస్పత్రికి రిఫర్ చేశారు. మరో 21 మందికి కళ్లద్దాలు అవసరమని గుర్తించి ప్రిస్క్రిప్షన్లు అందజేశారు. అదేవిధంగా మెరుగైన వైద్యం అవసరమైన ఒకరిని హైదరాబాద్‌లోని సరోజినీ దేవి కంటి ఆస్పత్రికి రిఫర్ చేశారు. కంటి పరీక్షా శిబిరంలో ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్, ఆప్తాల్మిక్ ఆఫీసర్ హరికిషన్‌తో పాటు ఆస్పత్రి సిబ్బంది పాల్గొని పరీక్షలు నిర్వహించారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యకర సమాజం



అక్షరటుడే, నిజామాబాద్ సిటీ: జాతీయ పోషణ మాసోత్సవం సందర్భంగా నిజామాబాద్ అర్బన్ ప్రాజెక్టు పరిధిలోని టౌన్ ప్రాంతంలో 'మన అంగన్వాడీ - మన బాధ్యత' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలు, పోషకాహారం ప్రాధాన్యత, రక్తహీనత నివారణ, గర్భిణులకు అందించే సేవలు, పిల్లల ఎదుగుదల పర్యవేక్షణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారిణి సౌందర్య మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రైతు సమస్యలపై రోడ్డెక్కిన బీజేపీ నాయకులు



అక్షరటుడే, పెద్దకొడప్‌గల్: కరెంట్ కోతల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలోని గాంధీ చౌక్ వద్ద బీజేపీ నాయకులు ఆందోళన చేపట్టారు. 'రైతు గోస-బీజేపీ భరోసా' కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన నిరసనలో నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రైతులకు నిరంతరాయంగా 24 గంటల విద్యుత్ సరఫరా అందించాలని కోరారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాల కారణంగా పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు పెట్టుబడులు పెట్టి సాగు చేసిన పంటలకు అవసరమైన సమయంలో విద్యుత్ అందకపోతే తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. అనంతరం విద్యుత్ శాఖ అధికారికి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నీలం చిన్నరాజు, జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, మండల అధ్యక్షుడు మల్లయ్యల సుభాష్, ఉపాధ్యక్షుడు ప్రేమ్‌సింగ్, కట్కే అశోక్, తానాజీ పటేల్, వెంకటకృష్ణ, నవీన్ గౌడ్, రేవన్ తదితర బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామాల్లో మహిళ సాధికారతకు, స్వయం సమృద్ధికి ఆసరాగా నిలుస్తున్న పొదుపు సంఘాల వ్యవస్థను కొందరు వీవోఏలు అవినీతిమయం చేస్తున్నారు. అధికారుల అండతో సభ్యులు కష్టపడి సంపాదించిన డబ్బులను మాయం చేస్తున్నారు. బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలను క్రమం తప్పకుండా చెల్లిస్తున్నప్పటికీ వాటిని పక్కదారి పట్టిస్తున్నట్లు వీవో ఏలపై ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని సభ్యులు కోరుతున్నారు.
– అక్షరటుడే, డిచ్‌పల్లి



సంఘాల సొమ్ముకు.. అవినీతి గండం..

- మహిళా సంఘాలను దోచుకుంటున్న అవినీతి జలగలు..!
- నెలవారీ రుణం చెల్లిస్తున్నా తీరని అప్పులు..
- బ్యాంకులకు చేరని సంఘాల సొమ్ము
- డిచ్‌పల్లి మండలంలో వెలుగుచూసిన అక్రమాలు..

అవినీతికి పాల్పడుతున్న వీవోఏలు అనుసరిస్తున్న తీరు అత్యంత విస్తుగొలుపుతోంది. సంఘ సభ్యుల నుంచి వాయిదాల రూపంలో వచ్చే పెద్ద మొత్తాలను తమ జేబుల్లో వేసుకుంటూ, అమాయక మహిళలను నిలువునా ముంచుతున్నారు. సభ్యుల వద్ద రూ. 50 వేలు తీసుకుని, తమ వద్ద ఉండే డిపాజిట్ వోచర్‌పై రూ.50 వేలు అని రాసి సంతకం చేసి సభ్యులకు ఇస్తున్నారు. బ్యాంకులో మాత్రం కేవలం రూ.10 వేలు మాత్రమే జమ చేస్తూ, మిగిలిన రూ. 40 వేలు తమ సొంత అవసరాలకు వాడుకుంటున్న ఉదంతాలు వెలుగు చూస్తున్నాయి. వీవోఏలు క్రమం తప్పకుండా వోచర్లు ఇస్తుండడంతో, తమ రుణం క్రమంగా తీరుతోందని మహిళలు పూర్తిగా నమ్మేస్తున్నారు.

డిచ్‌పల్లిలో వెలుగుచూసిన అక్రమాలు..!

సరిగ్గా ఇలాంటి ఘటనే డిచ్‌పల్లి మండలంలోని ఒక గ్రామంలో తాజాగా వెలుగుచూసింది. గ్రామానికి చెందిన మహిళా సంఘం సభ్యులు తమ రుణ వాయిదాలను ప్రతినెల క్రమం తప్పకుండా రూ.50వేల చొప్పున స్థానిక వీవోఏకు చెల్లిస్తూ వచ్చారు. చెల్లింపుల గడువు ముగియడంతో రుణం తీరిపోయిందని భావించిన మహిళలు రుణ విముక్తి పత్రం కోసం బ్యాంకుకు వెళ్లారు. బ్యాంకు అధికారులు ఖాతా పుస్తకాలను పరిశీలించి 'మీ రుణం ఇంకా పూర్తి కాలేదు.. పెద్ద మొత్తంలో బాకీ ఉంది' అని చెప్పడంతో మహిళలు ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. అసలు విషయం ఆరా తీస్తే.. తాము ప్రతి నెలా చెల్లించిన రూ.50వేలకు గానూ, వీవోఏ బ్యాంకు ఖాతాలో కేవలం రూ.10 వేలు జమ చేసినట్లు ఆధారాలతో సహా బయటపడింది.

అప్రమత్తమైన ఓ వీవోఏ

'సమాఖ్య రుణాల్లో చేతివాటం' శీర్షికతో ఇటీవల 'అక్షరటుడే'లో వచ్చిన కథనంతో ఒక గ్రామ వీవోఏకు భయం పట్టుకుంది. ఎక్కడ తన అవినీతి బండారం బయట పడుతుందోనని హైరానాకు గురవుతున్నట్లు తెలిసింది. ఎవరైనా వచ్చి బ్యాంకు లింకేజీ.. ఇతర రుణాల గురించి ఆరా తీస్తే చెప్పవద్దని మహిళా సభ్యులను ప్రసన్నం చేసుకునే పనిలో నిమగ్నమైనట్లు గ్రామస్తులు వాపోతున్నారు.

బుక్కుల నిర్వహణపై అనుమానాలు..?

మహిళా సంఘాల లావాదేవీల్లో వీవోఏల పాత్ర కీలకం. అయితే సంఘాల పొదుపు, బ్యాంకు జమ బుక్కులను సభ్యులకు ఇవ్వకుండా కొందరు వీవోఏలు తమ దగ్గరే ఉంచుకుంటున్నారు. సంఘ సభ్యులు కేవలం వీవోఏ ఇచ్చే కాగితపు వోచర్లను నమ్ముతున్నారు. సంబంధిత అధికారులు, ఏపీఎంలు గ్రామీణ స్థాయిలో వీవోఏల పనితీరును, రికార్డులను ఎప్పటికప్పుడు తనిఖీ చేయ డంలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. అలాగే ఆడిటింగ్ నామమాత్రం జరుగుతోందని, ఏటా జరగాల్సిన సంఘాల ఆడిటింగ్ ప్రక్రియ కాగితాలకే పరిమితం కావడంతో అవినీతి జలగలు ఏళ్ల తరబడి తప్పించుకుంటున్నట్లు ఆరోపణలు తీవ్రమయ్యాయి. సెర్ప్ ఉన్నతాధికారులు స్పందించి మహిళా సంఘాల ఖాతాలపై ఆడిటింగ్ జరిపించి వీవోఏలపై కఠిన చర్యలు తీసుకోవాలని మహిళలు కోరుతున్నారు.

హెచ్ఎంల అసోసియేషన్ కార్యవర్గ సభ్యులకు సన్మానం



అక్షరటుడే,నందిపేట్: జిల్లా హెచ్ఎం అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, కార్యదర్శిగా మోహన్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులను వెల్మల్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వెల్మల్ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం షేక్ అబ్దుల్, ఉపాధ్యాయులు లంక రఘువీర్, జిల్లా ప్రధాన ఉపాధ్యాయుల అసోసియేషన్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు బ్యాగుల పంపిణీ

అక్షరటుడే, ముప్కాల్: మండలంలోని కొత్తపల్లి ప్రీ ప్రైమరీ పాఠశాలలో విద్యార్థులకు గురువారం బ్యాగులను పంపిణీ చేశారు. పాఠశాలలో తాత్కాలిక ఉపాధ్యాయురాలిగాస్వప్న విధులు నిర్వహిస్తుండగా.. ఆమె కుమారుడు బోడ జస్విక్ పుట్టినరోజు సందర్భంగా పాఠశాల విద్యార్థులకు బ్యాగులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు అనికేశి రఘు, కె. శ్రీనివాస్, బోడ వికాస్, బోడ సాయన్న, కోట సాయన్న, ఉపాధ్యాయులు సాయిలు, ధనుంజయ్, సుజాత, స్వప్న, అరవింద్, ప్రీ ప్రైమరీ ఇన్‌స్ట్రెక్టర్ కోట స్వప్న, రాజశ్రీ తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులకు దుస్తుల అందజేత


అక్షరటుడే, ముప్కాల్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో ఈనెల 10 నుంచి 13 వరకు అంతర్‌జిల్లా కబడ్డీ ఛాంపియన్‌షిప్ పోటీలు జరుగనున్నాయి. ఈ పోటీల్లో పాల్గొనే జూనియర్ జిల్లా బాలికల జట్టుకు సీనియర్ కబడ్డీ క్రీడాకారులు గురువారం మెళకువలు నేర్పించారు. అదేవిధంగా మాజీ సర్పంచ్ మోహన్ రెడ్డి క్రీడాకారులకు క్రీడా దుస్తులను అందజేశారు. కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు ఏలేటి రాజేశ్వర్, సీనియర్ కబడ్డీ క్రీడాకారులు జక్క రాజేశ్వర్, ఆలూరు మోహన్ రెడ్డి, స్పోర్ట్స్ అకాడమీ సభ్యులు, సీనియర్ జాతీయ కబడ్డీ కబడ్డీ క్రీడాకారులు బాల్కొండ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బట్టు రాజేశ్వర్, జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గంగాధర్ రెడ్డి, పీడీ రాజ్ కుమార్, సీనియర్ జాతీయ క్రీడాకారులు అశోక్, భూమారెడ్డి, టి సాయన్న, గంగారం, ఎన్టీఆర్ ముత్యం, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.



ఎస్‌హెచ్‌వోను కలిసిన ఆలూర్ పాలకవర్గం

అక్షరటుడే, ఆర్మూర్ : ఆర్మూర్ ఎస్‌హెచ్‌వోగా బాధ్యతలు స్వీకరించిన కొండి చంద్రశేఖర్ రెడ్డిని ఆలూర్ సర్పంచ్ ముక్కెర విజయ్ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఐ చంద్రశేఖర్ రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. గ్రామంలో శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజల భద్రత, నేరాల నియంత్రణకు పోలీసుల సహకారం అందించాలని పాలకవర్గ సభ్యులు కోరారు. ఈ సందర్భంగా ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజల భద్రతకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు, ప్రజాప్రతినిధులు సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఆలూర్ పంచాయతీ పాలకవర్గ సభ్యులు, ఎస్సై రజినీకాంత్, ఏఎస్సై సుశీల్ కుమార్, వార్డు సభ్యులు సంజీవ్, రంజిత్, రాము, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

తాళం పగులగొట్టి ఇంట్లో చోరీ



అక్షరటుడే, మెండోరా: మండలంలోని దుదిగాం గ్రామంలో బుధవారం రాత్రి దుండగులు ఓ ఇంటి తాళం పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. గ్రామానికి చెందిన చంద్రశేఖర్ ఇంట్లోకి ప్రవేశించిన దొంగలు సుమారు మూడు తులాల బంగారం, అర కిలో వెండి, రూ.లక్ష నగదును అపహరించినట్లు పోలీసులు తెలిపారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మెండోరా ఎస్సై సుహాసిని తెలిపారు.

డ్రగ్స్‌తో జీవితాలను నాశనం చేసుకోవద్దు..



అక్షరటుడే, గాంధారి: డ్రగ్స్‌తో జీవితాలను నాశనం చేసుకోవద్దని ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాస్ అన్నారు. గాంధారి మండలంలోని ముదెల్లి గ్రామంలో సైబర్ నేరాలు, డ్రగ్స్‌పై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. యువత మత్తు పదార్థాలకు, చెడు అలవాట్లకు లోనై తమ భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సూచించారు. చెడు అలవాట్లకు బానిసలై కొంతమంది యువత నేరాల వైపు వెళ్తున్నారని.. చివరకు తల్లిదండ్రులకు భారంగా మారుతున్నారని పేర్కొన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తన, స్నేహాలు, అలవాట్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. మైనర్లు బైకులు నడపకూడదని, వాహనం నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్, సీట్‌బెల్ట్ ధరించాలని సూచించారు. కార్యక్రమంలో సదాశివనగర్ సీఐ వీరయ్య చౌదరి, గాంధారి ఎస్సై మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా భవన నిర్మాణానికి భూమిపూజ

అక్షరటుడే, భీమ్‌గల్: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి గ్రామంలోనూ మహిళా సంఘాలకు ప్రత్యేక భవనాలు మంజూరు చేయడం అభినందనీయమని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మల్లెల లక్ష్మణ్ అన్నారు. సంతోష్ నగర్ తండాలో నూతనంగా నిర్మించనున్న మహిళా భవనానికి అధికారులు, ప్రజాప్రతినిధులు గురువారం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో సంతోష్ కుమార్, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు అరిగెల జనార్దన్, మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఖలీం, నాయకులు వాక మహేష్, తండా ఉప సర్పంచ్ శివ, అలాగే పార్టీ సీనియర్ నాయకులు శేఖర్, లింబాద్రి, డిష్ అశోక్, శంకర్, నిర్మల్ శంకర్, విగ్నేష్, చిన్న కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులు ప్రతిభ చూపి రాష్ట్రానికి పేరుతేవాలి



అక్షరటుడే, నిజామాబాద్ సిటీ : క్రీడాకారులు ప్రతిభ చూపి రాష్ట్రానికి పేరుతేవాలని అమెచ్యూర్ తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షుడు బస్వా లక్ష్మీ నర్సయ్య అన్నారు. నగరంలోనిబస్వాగార్డెన్‌లో అమెచ్యూర్ తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి తైక్వాండో ఛాంపియన్‌షిప్ పోటీలకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జిల్లా స్థాయిలో పతకాలు సాధించిన క్రీడాకారులు రాష్ట్ర, జాతీయస్థాయిలో కూడా అత్యుత్తమ ప్రతిభ కనబర్చి తెలంగాణ రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని బస్వా లక్ష్మీనర్సయ్య ఆకాంక్షించారు. తైక్వాండో సాధన ద్వారా శరీరాన్ని చురుకుగా, క్రమశిక్షణతో, దృఢంగా తీర్చిదిద్దుకోవచ్చని తెలిపారు. పోటీల్లో వివిధ అకాడమీల క్రీడాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. క్రీడాకారులను నిరంతరం ప్రోత్సహిస్తూ, శిక్షణకు పంపుతున్న తల్లిదండ్రులకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే క్రీడాకారులకు శిక్షణ అందిస్తున్న కోచ్ జేసీ మనోజ్ కుమార్‌ను అభినందించారు. ఈ సందర్భంగా అకాడమీ కోచ్‌లు గంగాధర్, నాగరాజ్, శివకుమార్, వినయ్ తదితరులను అభినందించారు.